# దొంగదారికాడు

## —పాలకూర సీతాలత.

హయగ్రీవరావు పనిదొంగ. ఏరకంగా పని ఎగ్గొట్టాలా అని అనుక్షణం ఆలోచిస్తూ వుంటాడు. అందుకు ఏదైనా మంచి కారణం దొరికితే ఆనందంతో ఎగిరి గంతులేస్తాడు. అతన్ని సరైన దారిలో పెట్టాలని అతని సూపర్‌వైజర్ శౌరి చాలా రకాలుగా ప్రయత్నించాడు కానీ లాభం లేకపోయింది.

**ఇపుడు నిన్ను సస్పెండు చేయించడం చాలా సులభం. నువు ఘోరమైన అబద్ధం చెప్పావు. రాత పూర్వకంగా ఒప్పుకున్నావు. ఆ కాగితం చాలు అన్నాడు. 'అబద్ధమా!' అన్నాడు ఆశ్చర్యం నటిస్తూ హయగ్రీవరావు.**

అతనిమీద క్రమశిక్షణ చర్య తీసుకోవాలని శౌరి ప్రయత్నించాడు కానీ అతను చెప్పే కారణాలు అన్నీ సాంకేతికంగానూ, కొన్ని మానవత్వపు ధోరణిలోనూ వుండటంతో ఏం చెయ్యలేకపోతున్నాడు.

బెంచిగ్రైండర్ ముందుగా పాడుచేస్తాడు. ఆ తర్వాత తన 'టూల్' పదును చెయ్యనిదే మెషిన్ ఆపరేట్ చెయ్యడం కష్టం అని చెప్పి గ్రైండర్ దగ్గరకు వెళ్తాడు. అది పనిచెయ్యదు కనుక... టూల్ గ్రైండ్ కాదు కనుక... తను మిషన్ ఆపరేట్ చెయ్యలేనంటాడు. గ్రైండింగ్ మిషన్ బాగుఅయ్యే సమయానికి కడుపునొప్పి వంకతో అక్కడనుంచి జారుకుంటాడు. ఇది సాంకేతిక సమస్య!

హాస్పటల్లోఎవరో తెల్సిన వ్యక్తికి రక్తదానం చెయ్యాలంటాడు. లేకపోతే ఆ వ్యక్తి చచ్చిపోతాడని భయపెడతాడు. ఎవరిచేతనో ఫోను చేయిస్తాడు. ఆ వంకతో అక్కడనుంచి తప్పుకుని ఇల్లు చేరుకుంటాడు. ఇది మానవత్వపు సమస్య!

ఎప్పుడైనా ఫ్యాక్టరీలో కరెంటుపోతే ఇక మెషిన్ ఆపరేట్ చెయ్యక్కర్లేదు కనుక కొండంత సంతోషంతో కేరింతలు కొడతాడు.

అతనికి ఇష్టం లేనిది ఒక్కటే... పని చెయ్యడం—

అతనికి ఇష్టం అయినవి చాలావున్నాయి. అందర్నీ ఎగతాళి చేస్తూ పేర్లు పెట్టడం, సూపర్‌వైజరుకి తాటాకులు కట్టాలని చూడడం, కేంటిన్లో గంటలు తరబడి హస్కుకొట్టడం, డ్యూటీ టైములో పుస్తకాలు చదవడం, సన్నిహితంగా వున్నవాళ్ళమధ్య పుల్లలు పెట్టడం—

ఒకరోజు చాలా అత్యవసరం అయిన పనిని హయగ్రీవరావుకి ఇచ్చాడు శౌరి.

పన్నెండు గంటల తర్వాత అతని అడ్రసు లేదు.

'ఏ ప్రకృతి పిలుపుకో, కాంటిన్‌కో వెళ్ళి వుంటాడనీ, వచ్చేస్తాడనీ' ఆశించాడు శౌరి.

ఉహూ... ఆ వెళ్లినవాడు మళ్ళీ నాలుగ్గంటలకు వచ్చాడు.

"ఎక్కడికి వెళ్ళావు?" అడిగాడు శౌరి కోపంగా.

ఏదో నోటికి వచ్చిన అబద్ధం చెప్పడం అలవాటే కనుక తడుముకోకుండా చెప్పాడు హయగ్రీవరావు.

"బ్యాంకుకి వెళ్ళాను... చాలా అర్జంటు పని... అందుకని"

"ఎంత అర్జంటుపని అయినా అడుగకుండా వెళ్ళడం తప్పని తెలీదా? నీమీద చర్య తీసుకుంటాను..." మండిపడ్డాడు శౌరి.

అలాంటివి లెక్కచేసే తత్వంకాదు హయగ్రీవరావుది. ఎంతో గొప్పగా తన అవసరం గురించి కన్విన్స్ చెయ్యగల నేర్పు ఉన్నవాడు.

"అడగకుండా వెళ్లడం తప్పేకాదు. ఘోరమైన పాపం కూడా... ఆ సమయంలో మీరు లేరు... నాది జీవన్మరణ సమస్య... అందుకే వెళ్ళిపోయాను. తర్వాత మీకు నెమ్మదిగా నచ్చచెప్పుకోగలనని నా ఆశ..." అన్నాడు.

చాలా తెలివైనవాడు అతను. అందుకే అతని ఆటలు సాగుతున్నాయి.

"అంత పెద్ద సమస్య ఏమిటో..." వ్యంగ్యంగా అన్నాడు శౌరి.

గొంతు సవరించుకుని అన్నాడు హయగ్రీవరావు.

"మా బావమరిదికి స్కూటర్ ఏక్సిడెంట్ అయ్యింది విజయవాడలో. కబురు తెల్సినప్పట్నుంచీ మా ఆవిడ లబోదిబో అంటోంది. ఆపరేషన్ చెయ్యడానికి డబ్బు కావాలని మనిషి వచ్చాడు. బ్యాంకుకువెళ్ళి డబ్బు డ్రా చేయాల్సి వచ్చింది. ఆ పనిమీదే వెళ్లాను. మనిషికి డబ్బు ఇచ్చి, మా ఆవిడను పంపాను అతనితో... చెప్పండి... ఈ పని ఆలస్యం చేస్తే అక్కడ ఎంత ప్రమాదం... అందుకే వెళ్ళిపోయాను..."

భలే కట్టుకథ అల్లాడు. నిజం చెప్పాలంటే అతని భార్యకు సోదరులే లేరు.

అదంతా విని ఏదో ఆలోచిస్తున్న శౌరికి సడన్‌గా ఒక విషయం గుర్తుకువచ్చింది.

'అమ్మమ్మ... ఎంత ఘోరంగా అబద్ధాలు చెప్పేస్తున్నాడు...' అనుకున్నాడు.

ఇదే అవకాశం... వీడిని ఉచ్చులో బిగించాలని నిర్ణయించుకున్నాడు.

"అదంతా నాకు తెలీదు. నేను రాతపూర్వకంగా సంజాయిషీ అడుగుతాను. నువ్వు రాతపూర్వకంగా జవాబు ఇయ్యి..." అని చెప్పి అప్పటికప్పుడు మెమో ఇచ్చాడు.

నిర్భయంగా తను చెప్పిన విషయాన్నే రాసి ఇచ్చాడు హయగ్రీవరావు.

ఆ కాగితం మడిచి జేబులో పెట్టుకుంటూ శౌరి—

"ఇప్పుడు నిన్ను సస్పెండు చేయించడం చాలా సులభం. నువ్వు ఘోరమైన అబద్ధం చెప్పావు. రాతపూర్వకంగా ఒప్పుకున్నావు. ఆ కాగితం చాలు." అన్నాడు.

"అబద్ధమా?" అన్నాడు ఆశ్చర్యం నటిస్తూ హయగ్రీవరావు.



"అవును. నువ్వు బాంకుకు వెళ్ళలేదు. వెళ్ళాలని అనుకున్నా బ్యాంకుకు వెళ్ళి డబ్బు డ్రా చెయ్యడం కుదరని పని... ఎందుకంటే ఈరోజు ఆదివారం..."

ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు హయగ్రీవరావు. ఆలోచించాడు... నిజమే. శౌరి చెప్పింది కరెక్ట్ ఆరోజు ఆదివారం.

"ఇష్టం వచ్చినప్పుడల్లా నోటికి వచ్చిన అబద్ధాలు చెప్తూ డ్యూటీ ఎగ్గొడుతున్నావు. ఇందుకు రుజువు నా జేబులో కాగితం. ఇంక నీ పని క్లోజ్..." గంభీరంగా అన్నాడు శౌరి.

హయగ్రీవరావు సన్నగా ఒణికిపోయాడు. అతని గొంతు తడి ఆరిపోయింది. కళ్ళు మసకకమ్మాయి. అడ్డమైన కోతలు కోస్తూ అవతలివళ్ళను బుట్టలో వేసుకున్నానని సంతోషించే వ్యక్తి ఏదో ఒక రోజు ఉచ్చులో పడక తప్పదని గ్రహించాడు

వాళ్ళ ఫ్యాక్టరీకి ఆదివారం కాక బుధవారం శెలవు. అందుకే ఆరోజు ఆదివారం అన్న విషయం గుర్తురాక నోటికి వచ్చిన అబద్ధం చెప్తే అది తన మెడకు బిగుసుకుంది. వారానికి ఒక్కొక్క ప్రాంతంలో విద్యుత్ కోత విధించింది ప్రభుత్వం. ఈ ఫ్యాక్టరీకి ఆ కోత బుధవారం పడింది. కనుక ఆరోజు శలవుగా ప్రకటించి ఆదివారం పనిచేస్తుంది ఫ్యాక్టరీ.

ఏం చెయ్యాలో తోచక అటు, ఇటు చూశాడు హయగ్రీవరావు.

తప్పదు. తను తప్పు ఒప్పుకుని ఇకముందు బాగా పనిచేస్తానని మాట ఇచ్చి శౌరిని బతిమాలుకోవడం ఒక్కటే మార్గం.

ఇంకా దబాయించినందువల్ల ఫలితం శూన్యం.

అతని చూపులు శౌరి పాదాలమీద పడ్డాయి.

అటు నడిచాడు హయగ్రీవరావు. *